Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 166 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 6 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# గత ప్రభుత్వాల కారణంగా భారత్ 6వ స్థానం నుంచి 11కు పడిపోయింది



**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రిఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు.

# సిట్ రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది

**అమరావతి, (రాజధాని వార్తలు):** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. NDDB నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు.

**వైసీపీ హయాంలో హిందూ మతంపై దాడులు..**

ఐదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ధి కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడుకొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు.



# చిన్న సమస్యను పెద్దది చేశారు

## - రాహుల్ గాంధీకి మద్దతుగా శశి థరూర్ వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీని మాట్లాడకుండా అడ్డుకోవడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే పూర్తి హక్కు ఉంటుందని, దాన్ని కాలరాయడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని ఆయన అన్నారు. గురువారం ఈ విషయంపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ ప్రసంగానికి అభ్యంతరాలు చెప్పడం ద్వారా అధికార పక్షం ఒక చిన్న విషయాన్ని పెద్ద పార్లమెంటరీ సమస్యగా మార్చిందని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ ఇప్పటికే బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని మాత్రమే ఉటంకిస్తున్నారని థరూర్ గుర్తు చేశారు. "ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వాలి. ఆయన ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన విషయాన్నే ప్రస్తావిస్తున్నారు. అది రహస్య సమాచారమేమీ కాదు. తన వాదన వినిపించిన తర్వాత ఆయన రాష్ట్రపతి ప్రసంగంలోని ఇతర అంశాల పైకి వెళ్లేవారు. కానీ, అనవసరంగా పెద్ద అభ్యంతరాలు లేవనెత్తి, ఆయనను మాట్లాడకుండా చేయడం ద్వారా సభలో చాలా పెద్ద సమస్యను సృష్టించారు" అని థరూర్ వివరించారు. ఈ సందర్భంగా, తనకు జరిగిన ఓ ప్రమాదం గురించి కూడా థరూర్ వెల్లడించారు. బుధవారం పార్లమెంటు ప్రాంగణం వెలుపల తాను నడుస్తుండగా జారి కిందపడ్డానని, దురదృష్టవశాత్తు ఈ ఘటనలో తన కాలికి హెయిర్‌లైన్ ఫ్రాక్చర్ అయిందని తెలిపారు. ఈ కారణంగానే వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చిందని, అందుకే పార్టీ అంతర్గత సమావేశంలో చర్చలకు హాజరు కాలేకపోయానని, ఇందుకు క్షమించాలని కోరారు. గాయమైనప్పటికీ తన అధికారిక విధులకు ఎలాంటి ఆటంకం కలగదని ఆయన స్పష్టం చేశారు. "నేను ప్రతిరోజూ పార్లమెంటుకు వస్తాను. వచ్చే వారం జరగబోయే కమిటీ సమావేశాల్లోనూ పాల్గొంటాను. కాకపోతే, దురదృష్టవశాత్తు వీల్‌చైర్‌లో రావాల్సి ఉంటుంది" అని తన నిబద్ధతను చాటుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేతల గొంతును ప్రభుత్వం నొక్కివేస్తోందని కాంగ్రెస్ సహా విపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, శశి థరూర్ వ్యాఖ్యలు రాజకీయంగా మరింత ప్రాధాన్య తను సంతరించుకున్నాయి. ఒకవైపు రాజకీయంగా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే, మరోవైపు వ్యక్తిగత అస్వస్థతను సైతం లెక్క చేయకుండా విధులకు హాజరవుతానని ఆయన చెప్పడం గమనార్హం.

# మీరు చేసింది మహా పాపం...ఏక సభ్య కమిషన్ వేస్తున్నాం

**- తిరుమల నెయ్యి కల్తీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం - గత వైసీపీ ప్రభుత్వం 2022 నివేదికను ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని ఆరోపణ - సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన మొదలుపెట్టానని వెల్లడి - పామాయిల్, కెమికల్స్, జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేశారని ఆగ్రహం - దేవుడితో పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని తీవ్ర హెచ్చరిక**

**తిరుమల, (రాజధాని వార్తలు):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహాపాపం అని ఆయన అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను, అపవిత్ర ఘటనలను గుర్తు చేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల కీలక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.



**భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు**

కరడుగట్టిన నేరస్థులు అసత్యాన్ని ఎలా నమ్మిస్తారో, అలాగే గత పాలకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. "సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా చెప్పలేదు. అయినా, కల్తీ జరగలేదని ఎదురు దాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**దేవుడితో పెట్టుకోవద్దు.. ఇది దుర్మార్గమైన అపచారం**

వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. "అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్ర తను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వరస్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా స్వామివారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం" అని ఆయన తీవ్రంగా ఖండించారు.

**సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన**

తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రాధాన్యతగా పరిపాలన, దైవ కార్యాల ప్రక్షాళనపై దృష్టి సారించానని చంద్రబాబు వివరించారు. "ముఖ్యమంత్రిగా నా కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించడం నా మొదటి సంతకం. మానవ సేవకన్నా ముందు మాధవ సేవ ముఖ్యమని భావించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరుమల ప్రక్షాళన కోసం టీటీడీ ఈఓగా శ్యామలరావును నియమిస్తూ రెండో సంతకం చేశాను. ఈ రెండు పనులు పూర్తి చేశాకే ఇతర కార్యక్రమాలు చేపట్టాను" అని ఆయన తెలిపారు. అనంతరం తిరుమలలో పరిస్థితులను సమీక్షించి, కల్తీ జరుగుతోందన్న అనుమానంతో నెయ్యి శాంపిళ్లను నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)కు పంపించామని, ఆ నివేదికలోనే కల్తీ వాస్తవాలు బయటపడ్డాయని స్పష్టం చేశారు.

**2022లోనే నివేదిక.. అయినా తొక్కిపెట్టారు**

ఈ కల్తీ వ్యవహారం కొత్తగా బయటపడింది కాదని, 2022లోనే గత వైసీపీ ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందిందని చంద్రబాబు సంచలన విషయాలు వెల్లడించారు. "2022లో సీఎఫ్టీఆర్ఐ ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ జరుగుతోందని చాలా స్పష్టంగా ఉంది. కానీ, ఆ నివేదికను వాళ్లు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించారు" అని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏర్పాటైన సిట్ విచారణలో మరింత భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, నెయ్యి తయారీలో పామాయిల్, ప్రమాదకర రసాయనాలు, చివరికి జంతువుల కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కూడా వాడుతున్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. "ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో తిరుమల రెండు కొండలే, ఏడు కొండలు కాదని మాట్లాడినప్పుడు మేం వ్యతిరేకించాం. విజయనగరంలో రాముడి విగ్రహం తల నరికి వేస్తే, అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసు కోవాలనుకున్న నాపైనే కేసు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబడితే ఎలుకలు కొరికాయని చెప్పారు. ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు" అని ఆయన మండిపడ్డారు.

# ఖర్గే, నడ్డా మధ్య వాగ్వాదం.. రాజ్యసభలో హోరాహోరీ





**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, కేంద్ర మంత్రి జేపీ నడ్డా మధ్య పార్లమెంటరీ విధానంపై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. బుధవారం లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేయాల్సిన ప్రసంగం ఆగిపోయిన సంగతి తెలిసిందే. గురువారం రాజ్యసభలో కూడా అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. పార్లమెంటులో జాతీయ ప్రయోజన అంశాల గురించి మాట్లాడటంపై ఆంక్షలు విధిస్తున్నారని ఖర్గే ఆరోపించడంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా అభ్యంతరం వ్యక్తం చేశారు. 'పార్లమెంట్ అంటే లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఉంటాయి. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు దేశ ప్రయోజనాల గురించి మాట్లాడాలనుకున్నారు. కానీ అలా చేయడానికి ప్రభుత్వం అనుమతించలేదు. మీరు సభను ఇలా ఎలా నడపగలరు' అని ఖర్గే ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు జేపీ నడ్డా స్పందిస్తూ.. 'లోక్‌సభ కార్యకలాపాలను రాజ్యసభలో చర్చించలేము. నా గౌరవనీయ సహోద్యోగి ఈ విషయాన్ని తెలుసుకోవాలి' అని సమాధానం ఇచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేనిపైనా చర్చ నిర్వహించడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని నడ్డా అన్నారు. 'లోక్‌సభలో ఏ ప్రశ్నకైనా సమాధానం ఇవ్వడానికి ప్రధాని మోదీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కానీ ప్రతిపక్షం సభా కార్యకలాపాలను ముందుకు సాగనివ్వడం లేదు. ప్రతిపక్షాలు అడిగినట్లుగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాలపై ఒక ప్రకటన చేశార'ని జేపీ నడ్డా గుర్తు చేశారు. తీవ్ర వాగ్వాదం తర్వాత, ప్రతిపక్ష ఎంపీలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

# విక్రమ సింహపురి యూనివర్సిటీలో 'ఏపిఏఏఆర్' క్రెడిట్ సీడింగ్‌పై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం 'APAAR (Academic Bank of Credits -- Automated Permanent Academic Account Registry) క్రెడిట్ సీడింగ్'పై ఒకరోజు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఏపిఎస్‌సిహెచ్‌ఇ), నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడి) మరియు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఏపిఏఏఆర్ వ్యవస్థ ద్వారా విద్యార్థుల అకడమిక్ క్రెడిట్లు డిజిటల్ రూపంలో భద్రంగా భద్రపరచబడతాయని తెలిపారు. దీనివల్ల ఉన్నత విద్యలో చదువు మధ్యలో నిలిచిపోవడం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, విద్యార్థుల అకడమిక్ భవిష్యత్తుకు ఇది బలమైన భరోసా ఇస్తుందన్నారు.

APSCHE వైస్ ఛైర్‌పర్సన్ ఆచార్య కె. రత్నా షీలా మణి మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం – 2020 (ఎన్ఇపి–2020)లో ప్రతిపాదించిన మల్టిపుల్ ఎంట్రీ – ఎగ్జిట్ విధానానికి ఏపిఏఏఆర్ వ్యవస్థ వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థల్లో పారదర్శకత, సమన్వయం పెరగడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ప్రాంతీయ సమన్వయకర్త రవి పాండే మాట్లాడుతూ, విద్యార్థుల మార్కుల పట్టికలు, సర్టిఫికెట్లు, డిగ్రీ వివరాలు ఎన్ఏడి వేదిక ద్వారా సురక్షితంగా నిల్వ ఉంటాయని చెప్పారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ వేగవంతమవుతుందని, విద్యార్థులకు సౌలభ్యం కలుగుతుందన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత మాట్లాడుతూ, విద్యార్థుల అకడమిక్ రికార్డులన్నీ ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి రావడం వల్ల వారి విద్యా ప్రయాణం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. డిజిటల్ ఇండియా లక్ష్యాల సాధనలో ఏపిఏఏఆర్ కీలక అడుగుగా నిలుస్తుందన్నారు.

**వర్క్‌షాప్ ప్రాముఖ్యత**

ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యా సంస్థల ప్రతినిధులకు ఏపిఏఏఆర్ క్రెడిట్ సీడింగ్ అమలు విధానం, అకడమిక్ రికార్డుల డిజిటలైజేషన్‌పై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఒక విశ్వవిద్యాలయం నుంచి మరో విశ్వవిద్యాలయానికి విద్యార్థులు మారినప్పుడు, వారి క్రెడిట్లను సులభంగా బదిలీ చేసుకునే అవకాశాన్ని ఇది కల్పిస్తుందని వక్తలు తెలిపారు.

**అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు వారధిగా ఏపిఏఏఆర్**

వక్తలు ఏపిఏఏఆర్ వ్యవస్థ అంతర్జాతీయ ప్రయోజనాలను కూడా వివరించారు.

ఏపిఏఏఆర్ ఐడి ద్వారా విద్యార్థుల అకడమిక్ రికార్డులు డిజిటల్‌గా ధృవీకరించబడటం వల్ల, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ సులభమవుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, పేపర్‌లెస్ ధృవీకరణ ద్వారా పారదర్శకత పెరిగి, మోసాలకు తావు లేకుండా విద్యార్థుల ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో తక్షణ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, డా సిహెచ్ వెంకటరయులు, డా.ఆర్.మధుమతి, డా. పి.సుజాత, డా. యన్ ఓ గోపాల్, కె వి ఎల్ శ్రీకన్య రావు, డా. యం. హుస్సేనయ్య, డా.యం హనుమారెడ్డి, ఏపిఏఏఆర్ నోడల్ ఆఫీసర్లు, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విఐటి–ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28 నుండి మే 3 2026 వరకు నిర్వహణ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గ్రూప్ సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్ లలో ప్రవేశం కోసం విఐటి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష 2026ను నిర్వహించనుంది. ఈ పరీక్ష భారతదేశంలో మరియు విదేశాలలో నిర్దేశిత పరీక్షా కేంద్రాలలో ఏప్రిల్ 28 నుండి మే 3, 2026 మధ్య నిర్వహించబడుతుంది మరియు దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 31, 2026 గా నిర్ణయించ బండింది. VITEEE 2026 కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించబడుతుంది. పరీక్షా సమయం 2 గంటల 30 నిమిషాలు ఉంటుంది మరియు అభ్యర్థులు ఒక్కసారి మాత్రమే పరీక్షకు హాజరు కావడానికి అనుమతించబడతారు. ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే దరఖాస్తు మరియు ప్రవేశం రద్దు చేయబడతాయి. ప్రశ్నపత్రంలో పూర్తిగా బహుళైచ్ఛిక ప్రశ్నలు (వీజులు) ఉంటాయి మరియు ఇది కేవలం ఆంగ్లంలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. పరీక్షా విధానం ఈ క్రింది విధంగా ఉంటుంది: గణితం/జీవశాస్త్రం: 40 ప్రశ్నలు. భౌతికశాస్త్రం: 35 ప్రశ్నలు. రసాయనశాస్త్రం: 35 ప్రశ్నలు. ఆప్టిట్యూడ్: 10 ప్రశ్నలు. ఆంగ్లం: 5 ప్రశ్నలు. ప్రశ్నపత్రంలో మొత్తం 125 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తీసివేయబడుతుంది మరియు సమాధానం ఇవ్వని లేదా సమీక్ష కోసం గుర్తించిన ప్రశ్నలకు ఎలాంటి మార్కులు ఇవ్వబడవు లేదా తీసివేయబడవు. ఎంపిక మరియు కౌన్సెలింగ్ ప్రక్రియ. అభ్యర్థుల ఎంపిక కేవలం VITEEE 2026లో పొందిన ర్యాంక్ ఆధారంగా మాత్రమే ఉంటుంది. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అర్హులు, ఈ సమయంలో వారు తమకు నచ్చిన క్యాంపస్, ప్రోగ్రామ్ మరియు ఫీజు విభాగాన్ని ఎంచుకోవచ్చు. సీట్ల కేటాయింపు అభ్యర్థి ర్యాంక్ మరియు కౌన్సెలింగ్ సమయంలో అందుబాటులో ఉన్న ఎంపికల ఆధారంగా ఉంటుంది. మరిన్ని తాజా సమాచారం మరియు వివరణాత్మక వివరాల కోసం, అభ్యర్థులు అధికారిక VIT వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు https://viteee.vit.ac.in.

# రాజధానిలో పలు ప్రాజెక్టుల నిర్మాణాలు పరిశీలించిన మంత్రి నారాయణ




**అమరావతి, (రాజధాని వార్తలు):** సీడ్ యాక్సిస్ రోడ్డును ఓల్డ్ హైవేకు కలిపే స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి. గుంటూరు ఛానల్‌పై సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానించే బ్రిడ్జి పనులు పరిశీలన. రెండు బ్రిడ్జిల పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు ఆదేశాలు. విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి. ఇప్పటికే వెస్ట్ బైపాస్ పై ఒకవైపు వాహనాలకు అనుమతిచ్చిన ఎన్ హెచ్ అధికారులు. వెస్ట్ బైపాస్ రోడ్డు రెండు వైపులా అనుమతిస్తే గుంటూరు, విశాఖపట్నం నుంచి నేరుగా రాజధానిలోకి వెళ్లే ఛాన్స్.

# అక్రమాలకు పాల్పడిన దోషులు ఎవరైనా, ప్రజల మనోభావాలతో ఆడుకున్న వారిని ఉపేక్షించే సమస్యే లేదు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, (రాజధాని వార్తలు):** మానవ సేవే..మాధవ సేవ అంటాం. అలాంటి ఆ భగవంతుడి ప్రసాదాన్నే కల్తీ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీయడానికి కావాలనే చేసిన పనిగా మేం భావిస్తున్నాం. పామాయిల్, లాక్టిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ లాంటి రసాయనాలు ప్రసాదంలో ఉన్నప్పుడు మహాపాపం కాదా? ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి వీళ్లెవరు. ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తారా.? మత సామరస్యాన్ని కాపాడతాం. అన్ని మతాలను కూడా గౌరవిస్తాం. ఇష్టప్రకారం చేస్తాను అనే వ్యక్తులకు ప్రజలే సమాధానం చెబుతారు. ప్రజల తరపున తిరుమల పవిత్రతను కాపాడతాం, అదే మాధవ సేవ. ఈ అంశంపై ఇతర పీఠాధిపతులలోనూ చర్చించి ముందుకు వెళ్తాం. 219 ఆలయాలపై గత పాలకులు దాడి చేసి అపవిత్రం చేసే ప్రయత్నం చేశారు. శ్రీవారి పరకామణిలో చోరీ కేసులో సెటిల్మెంట్ చేసే ప్రయత్నం చేస్తారా.? ఇదెక్కడి విడ్డూరం? జరిగిన తప్పును సమర్థించేసి సెటిల్ చేయాలని ప్రయత్నం చేసే వ్యక్తులను ఏమనాలి. ఇష్టానుసారంగా బూతులు మాట్లాడితే సహించాలా. అసెంబ్లీలో నా కుటుంబంపై మాట్లాడిన బూతుల కారణంగా జీవితంలో తొలిసారి నేను కన్నీళ్లు పెట్టుకున్నాను. నెయ్యి కల్తీ జరగలేదని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని నివేదికలో ఎక్కడుంది.? ఏమైనా కలకన్నారా.? వాళ్లకు దేవుడు వచ్చి చెప్పారా.? క్షమించరాని మహాపాపం చేశారు. ఈ మహాపాపాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించలేం. ఉద్దేశపూర్వకంగానే శ్రీవేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయడానికి కుట్ర చేశారు. అన్ని నివేదికలనూ ప్రజల ముందే ఉంచుతాం. చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి.

# ఎఫ్.పి.ఓలను స్వయం సమృద్ధి సంస్థలుగా తీర్చిదిద్దాలి : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో అనుసంధానం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం విజయవాడలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రధాన కార్యాలయంలో ఎఫ్.పి.ఓలకు సాంకేతిక సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల (ఎన్‌జివోల) ప్రతినిధులు, సెర్ప్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సెర్ప్–ఎఫ్.పి.ఓల నిర్మాణం, వాటి బలోపేతం, ప్రస్తుత స్థాయిని అంచనా వేసేందుకు ఒక ప్రత్యేక 'టూల్' అభివృద్ధిపై చర్చించారు. 'ఒక ఎఫ్.పి.ఓ – ఒక ఉత్పత్తి' విధానంలో భాగంగా వాల్యూ చైన్ అభివృద్ధి, ఎఫ్.పి.ఓల స్థాయిలో చేపడుతున్న వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించారు. ప్రతీ నెల, సంవత్సర కాలానికి స్పష్టమైన రోడ్ మ్యాప్, జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. విజయవంతమైన ఎఫ్.పి.ఓల కేస్ స్టడీలను వీడియో డాక్యుమెంటరీలుగా రూపొందించాలని సూచించారు. ఎన్.జి.ఓల పురోగతిని సమీక్షించడానికి ఒకే రకమైన ఫార్మాట్‌ను రూపొందించాలని, అలాగే ఎన్.జి.ఓ భాగస్వాములు సంబంధిత జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లతో (పిడిలతో) సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో సెర్ప్ కార్యదర్శి వాకాటి కరుణ, డిప్యూటీ సి.ఇ.ఓ శ్రీరాములు నాయుడు, హైపర్ ఇంటర్నేషనల్, బ్రెడ్స్, కాల్గుడి, డిజిటల్ గ్రీన్, వాసన్, విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

# 2019-24 మధ్య చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా గత పాలకులు ఇబ్బందులు పెట్టారు

## - వారందరికీ చెల్లింపులు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, (రాజధాని వార్తలు):** 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించాం. 60 వేల మంది నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన ప్రతినిధుల సైన్యం మీది. సాగునీటి సంఘాలకే నామినేషన్ కింద పనులు ఇస్తున్నాం. ప్రతీ ఎకరాకూ నీరిచ్చేలా పనిచేయండి. చేసే పనులకు జీఎస్టీ లేకుండా చూస్తాం. కాలువల్లో నీటి ప్రవాహ బాధ్యత మీ అందరిదీ. నీటి పన్నులు కూడా వసూలు చేసుకుని సమర్థంగా కాలువల నిర్వహణ చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జలాశయాలూ నీటితో కళకళలాడుతున్నాయి. సరైన సమయానికే రబీ, ఖరీఫ్ సాగు కోసం నీరు ఇచ్చేలా ప్రణాళిక చేద్దాం. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలని కోరుతున్నాను. తద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా కార్యాచరణ చేపడతాం. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల వ్యవధిలోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నాం. ఇప్పటి వరకూ రూ.10 వేల కోట్ల మేర డబ్బులు రైతుల ఖాతాలకు జమ చేశాం. రైతులు ప్రకృతి సేద్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రకృతి సేద్యం ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ, ఆరోగ్యం కూడా మెరుగవుతుంది. నీటిపారుదల శాఖ పేరు మార్చి జలవనరుల శాఖగా మార్చాం. నీటి వినియోగదారుల సంఘాలు కూడా వివిధ బాధ్యతలు తీసుకోవాలి. భూగర్భ జలాలు పెంచే బాధ్యతతో పాటు కాలువలు, ప్రాజెక్టుల ద్వారా నీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలి.

# ఆంధ్రప్రదేశ్‌ను రైతు సానుకూలప్రదేశ్‌గా మారుస్తున్నాం

**అమరావతి, (రాజధాని వార్తలు):** నీటి వినియోగదారుల సంఘాల సమావేశంలో పాల్గొని ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను రైతు సానుకూలప్రదేశ్‌గా మారుస్తున్నాం. నీటి భద్రత అందరికీ కావాలి..కానీ నీటి సంరక్షణను చాలా మంది పట్టించుకోవటం లేదు. గతంలో రాయలసీమలోని ఊట కాలువల్లోనూ నీళ్లు సమృద్ధిగా ఉండేవి. రాయలసీమ రాళ్ల సీమగా మారకుండా రతనాల సీమగా మార్చాలని ఎన్టీఆర్ ప్రాజెక్టులు చేపట్టారు. హంద్రీనీవా, గాలేరు–నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులు టీడీపీ చూపిన చొరవ కారణంగానే వచ్చాయి. తెలుగు గంగ రాయలసీమను సస్యశ్యామలం చేస్తూ చెన్నై దాహార్తిని తీరుస్తోంది. ప్రాంతాలు, రాష్ట్రాల మధ్య నీటి కోసం విభేదాలు వచ్చిన పరిస్థితి. కావేరీ జలవివాదం అలాంటిదే. నీటి విలువ తెలిసిన వ్యక్తిగా నీరు మీరు, నీరు చెట్టు వంటి భూగర్భజలాలు పెంచేలా భూమినే జలాశయంగా మార్చడానికి ఇంకుడు గుంతల కార్యక్రమం చేపట్టాం. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అనంతపురంలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాన్ని మన్ కీ బాత్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. పది లక్షల ఇంకుడు గుంతలు, మైక్రో ఇరిగేషన్ ద్వారా నీటిని సద్వినియోగం చేస్తున్నాం. అనంతపురం జిల్లాను ఎడారి కాదు పండ్ల తోటల వనంగా మార్చాం. హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలోని 40 జీవనదుల నీటిని సమర్థంగా వినియోగించుకుంటే కరువనేదే ఉండదు. ప్రతీ ఎకరాకూ నీటిని ఇచ్చేలా నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ప్రయత్నాలు చేయాలి. పరుగెత్తే నీటిని నిలపండి, నడిచే నీటిని జలాశయంగా మార్చండి, భూగర్భ జలాశయంలో నీటి నిల్వ పెరిగేలా చూడండి.

# "సీమ ఎత్తిపోతల సాధనే ధ్యేయం : కాకాణి"






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజక వర్గం, పొదలకూరు మండల కేంద్రంతో పాటు, భోగసముద్రంలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, యూరియా సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని పేర్కొన్న రైతులు. కూటమి పాలనంతా అవినీతి, అక్రమాల మయం తప్ప, అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు. ఇటీవల మృతి చెందిన త్రోవ గుంట ప్రసాద్ నాయుడు తండ్రి, చిన్న మస్తాన్ నాయుడుతో పాటు వెన్నపూస సుందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాకాణి. కూటమి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు సకాలంలో యూరియా అందక, అనేక కష్ట, నష్టాలు పడవలసి రావడం దురదృష్టం. యూరియా సకాలంలో అందక, రెట్టింపు ధరతో బ్లాక్ మార్కెట్లో రైతులు కొనుగోలు చేశారు. జగనన్న ముఖ్యమంత్రిగా రైతుల ముంగిటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా రాజకీయాలకు, పార్టీలకు, అతీతంగా సమృద్ధిగా రైతులకు యూరియా అందించాం. గ్రామాల్లోని అంతర్గత రోడ్లతోపాటు, ప్రధాన రహదారులన్నిటిని నిర్మించాం. చంద్రబాబు తెలంగాణ ముఖ్యమంత్రి మాటలు విని, కృష్ణా జలాలను మనకు రానివ్వకుండా రాయలసీమ ఎత్తిపోతలను అడ్డుకోవడం దుర్మార్గం. రాయలసీమ ఎత్తిపోతల పథకం, నిలిపివేయడాన్ని నిరసిస్తూ, రేపు చలో పోతిరెడ్డిపాడుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. జగనన్న తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం, తిరిగి ప్రారంభించే దాకా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం. రైతులు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన జగనన్న ప్రభుత్వానికి, రైతులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉంది. కూటమి పాలనలో కక్ష సాధింపులతో విసిగి, వేసారి పోయిన ప్రజలు జగనన్న పాలనను కోరుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయం. జగన్మోహన్ రెడ్డి పర్యటనలలో విశేషంగా ప్రజలు పాల్గొనడాన్ని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతుంది. జగన్మోహన్ రెడ్డి పర్యటనలను అడుగడుగునా అడ్డుకునేందుకు పోలీసులను ఉసిగొల్పి, ఎక్కడాలేని నిబంధనలతో జనాన్ని అడ్డుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా జనం లెక్కచేయకుండా భారీగా తరలి రావడం, రేపటి రోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతుంది అనడానికి సంకేతం. నెల్లూరు జిల్లాలో ఎక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు ఎటువంటి కష్టం వచ్చినా అన్ని విధాల అండగా నిలుస్తాం. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తాం.

# 29వ వార్డులో అట్టహాసంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం జనసేన పార్టీ మహా విశాఖ నగరపార్టీ అధ్యక్షులు, దక్షిణ నియో జకవర్గం శాసనసభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు 29వ వార్డు జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమెరికన్ హాస్పిటల్ ఓల్డేజీ హోమ్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్యంగా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచి మనిషి ప్రజానాయకుడు వంశీకృష్ణ శ్రీనివా స్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ దక్షిణ నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో శాసనసభకు ఎన్నికై ప్రజలందరి మనల్ని పొందిన మనసున్న నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ని దక్షిణ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఒకవైపు పార్టీని మరోవైపు కార్యకర్తలని ఇంకొక వైపు నియోజకవర్గాన్ని సమన్వ యం చేసుకుంటూ ముందుకు వెళ్తున్న మన అందరి అభిమాన నాయకుడికి మరొకసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రీ స్వామివారి ఆశీస్సులతో ఎల్లప్పుడూ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుద్దల అనురాధ, గొలగాని రవీశ్వరరావు, చొక్కాకుల రాంబాబు, దేవర శేఖర్, తోటపల్లి నారాయణ, పల్లా లక్ష్మి, చందక భూలక్ష్మి, కొర్రాయ రమణమ్మ, విజయమ్మ, కొండమ్మ, గోపి కళ్యాణం, పల్లా రమేష్, పల్లా చలపతి, కొండలరావు మాస్టర్, గంగరాజు, పల్లా శ్రీనివాసరావు, వియ్యపు చిన్నారావు, బొట్టా అప్పారావు, ఒమ్మి వెంకట అప్పారావు, చిత్తూరు వెంకటేశ్వరావు, కాగిత వెంకటరావు, అప్పలరాజు, నాసర్, అంగటి సురేష్ , సారిపల్లి శ్రీనివాసరావు, కర్రి చిన్ని, పెసల శివ, మజ్జి శ్రీను, స్పోర్ట్స్ మహేష్, నడుపూరి రాజు, మజ్జి రాజు, జంపా గురునాథ్, బమ్మిడి భార్గవ్, కనకరాజు, కాకర రాజేష్, దువ్వి లోకేష్, వీరబాబు, గొలగాని లక్ష్మణ్, సింగంపల్లి పీరుబాబు, చెన్న ప్రవీణ్, వంగా కొండలరావు, టైలర్ సతీష్, శేఖర్, ఆంథోనీ నగర్ శంకర్, బండి అప్పలరాజు, జెరాక్స్ రమణ, దుక్క ప్రసాద్, బూర్ల రామారావు చొప్ప అప్పలరాజు, మురళి, రామకృష్ణ, రమణ, కూటమి నాయకులు మరియు జనసేన నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కమిటీ ఆన్ పబ్లిక్ అండర్ టేకింగ్స్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంటు సభ్యులు, కమిటీ ఆన్ పబ్లిక్ అండర్ టేకింగ్స్ మెంబర్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం CoPU ( committee on public under takings) సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీలో దక్షిణాఫ్రికా పార్లమెంట్ కేటాయింపుల స్టాండింగ్ కమిటీ సభ్యులతో జరగగా వివిధ అంశాలపై వారు చర్చించారు.

రెండు దేశాల మధ్య వాణి జ్యం, ప్రభుత్వ రంగ కంపెనీల అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా దక్షిణ ఆఫ్రికా సభ్యులతో వివిధ అంశాలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు.

# సచివాలయాలకు ప్రింటర్ల పంపిణీ

**పి.గన్నవరం, (రాజధాని వార్తలు):** పి.గన్నవరం మండలంలో 9 సచివాలయాలకు ప్రింటర్లను ఎమ్మెల్యే గడి సత్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 9 సచివాలయాల సిబ్బందికి కొత్త ప్రింటర్ల ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, సచివాలయాల్లో పనులు ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగేందుకు గన్నవరం మండలంలోని 9 సచివాలయాలకు ప్రభుత్వం ప్రింటర్లను మంజూరు చేసిందని, వాటిని ఈరోజు సచివాలయాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే, సచివాలయ సిబ్బంది ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఏ అవసరంతో వచ్చినా వారి పనులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పనిలోనూ అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టంగా సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం పంచాయతీకి మంజూరైన స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర రథాన్ని పంచాయతీ సిబ్బందికి ఎమ్మెల్యే అందజేశారు.







ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కమిటీ ఆన్ పబ్లిక్ అండర్ టేకింగ్స్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంటు సభ్యులు, కమిటీ ఆన్ పబ్లిక్ అండర్ టేకింగ్స్ మెంబర్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం CoPU ( committee on public under takings) సమావేశంలో పాల్గొన్నారు.

ఢిల్లీలో దక్షిణాఫ్రికా పార్ల మెంట్ కేటాయింపుల స్టాండింగ్ కమిటీ సభ్యులతో జరగగా వివిధ అంశాలపై వారు చర్చించారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, ప్రభుత్వ రంగ కంపెనీల అంశాలపై చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా దక్షిణ ఆఫ్రికా సభ్యులతో వివిధ అంశాలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు.

# సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

### - అక్షరాంధ్ర కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత వైపు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. బుధవారం నెల్లూరు నగరంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురువీధిలో ఉన్న దర్గామిట్ట రామనగర్, 37వ వార్డు పరిధిలోని వార్డు సచివాలయంలో నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభ్యాసకులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఏ విధంగా చదువుతున్నారో తెలుసుకున్నారు. అభ్యాసకుల చదువు సామర్థ్యాన్ని పరీక్షించడంతో పాటు, బోధన నిర్వహిస్తున్న వాలంటీర్ టీచర్ల బోధన విధానాన్ని కూడా సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సరళమైన పదాలు, సరళమైన వాక్యాలు, సులభమైన గణిత పద్ధతుల ద్వారా అభ్యాసకులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అభ్యాసకులు ప్రతిరోజూ అక్షరాంధ్ర కేంద్రాలకు హాజరై క్రమం తప్పకుండా విద్యను అభ్యసించాలని తెలిపారు. మార్చి 29వ తేదీన నిర్వహించనున్న అక్షరాస్యత పరీక్షలకు అర్హులైన అభ్యాసకులు అందరూ తప్పనిసరిగా పాల్గొని, అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేసి అక్షరాస్యులుగా మారాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డిడి మస్థాన్ రెడ్డి, నగర అసిస్టెంట్ కమిషనర్ హిమబిందు, వయోజన విద్య అక్షరాంధ్ర నోడల్ అధికారి మల్లు మస్తాన్ రెడ్డి, సూపర్వైజర్లు ఎం. కృష్ణ కిశోర్, ఎల్. రామ్ కుమార్, మెప్మా సీ ఎం ఎం జరీనా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సామాజిక న్యాయంపై కనిపించని కుట్ర

ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను నివారించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజీసీ) గత నెల 13న జారీ చేసిన కొత్త నిబంధనలు తీవ్ర అలజడికి దారితీశాయి. వాటిపై నెలకొన్న వివాదం ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం గురించి ఎంతమాత్రం కాదు. నిజ జీవిత పర్యవసానాలతో కూడిన రాజకీయ ప్రహసనమది. ఆరంభం నుంచి ముగిసే వరకు ఆ నాటకంలోని ప్రతి సన్నివేశం కూడా ద్వేష భావంతో నిండివున్నది. తొలుత పాటించిన వైఖరికి విరుద్ధమైన నిర్ణయం తీసుకుంది యూజీసీ. సామాజిక న్యాయం పట్ల ఉదాసీనత చూపే పాలనా వ్యవస్థ ఉన్నత విద్యా సంస్థలలో వివక్షను రూపుమాపేందుకు ఉద్దేశిస్తూ కొత్త నిబంధనలు జారీ చేసింది. ఆ తరువాత ఆ నిబంధనలకు వ్యతిరేకంగా భిన్నాభిప్రాయాన్ని ఉత్పత్తి చేశారు. పాలకులకు విధేయులు అయినవారు తమ సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలకు పూనుకున్నారు. ఆధిపత్యాన్ని చలాయించేవారే తాము వేధింపులకు గురవుతున్నామని ఆక్రోశించారు. అంతిమంగా సర్వోన్నత న్యాయస్థానం రంగప్రవేశం చేసింది. వివక్ష నివారణకు నిబంధనలు రూపొందించి అమలుపరచాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానమే తీరా అవి జారీ అయిన తరువాత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేవనే అభిప్రాయంతో వాటి అమలుపై స్టే విధించింది. యూజీసీ నిబంధనల అమలును సుప్రీంకోర్టు నిలిపివేయడం సాంకేతికంగా ఒక చిన్న విషయమే కావచ్చు కానీ పౌరులు, ప్రభుత్వం మధ్య రాజ్యాంగంలో పొందుపరచిన ఒక సున్నితమైన సామాజిక ఒప్పందాన్ని ఉల్లంఘించే న్యాయ నిర్ణయమది. యూజీసీ నిబంధనలపై వివాదం విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సామాజిక వివక్ష ఉందా లేదా అనే విషయంపై కాదు. ఉందనేది ఒక తిరుగులేని వాస్తవమని ఇటీవలే ప్రచురితమైన ఎన్.సుకుమార్ పుస్తకం ధ్రువీకరించింది. ఆ అంశంపై ప్రస్తుతమున్న సమాచారంతో పాటు తాను స్వయంగా నిర్వహించిన సర్వే, విద్యార్థుల వ్యక్తిగత అనుభవాలు, సంస్థాగతమైన విశ్లేషణల ఆధారంగా ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్ష వ్యవస్థాగతమైనదని సుకుమార్ నిరూపించారు. సంప్రదాయిక కుల పరపతి ఎలా ఆధునిక అవకాశాలకు ఆలంబన అవుతుందన్న విషయమై ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ప్రతిపాదన ఆధారంగా వ్యక్తిగత మేధా విజయాలకు అది దోహదం చేస్తున్న తీరుతెన్నులను సుకుమార్ వివరించారు. దేశంలోని కొన్ని ఉత్కృష్ట ఉన్నత విద్యాసంస్థలలో దళిత విద్యార్థులు ఏ విధంగా నిందలు, దుర్భాషల నెదుర్కొంటున్నదీ సుకుమార్ పేర్కొన్నారు. అగ్రకులాలకు చెందిన విద్యార్థులు తమ సహచర విద్యార్థులు అయిన దళిత సామాజికులను 'కోటా సంతానం', 'కేటగిరీ వాలా', 'సర్కారీ దమాద్', 'సర్కారీ బ్రాహ్మిణ్', 'సద్దూస్' లేదా 'బెహెన్జీ' అని, ఇంకా చెప్పలేని మాటల్లో ఎత్తి పొడుస్తుంటారని సుకుమార్ తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు, మూల్యాంకనాలు, పరిశోధనా పర్యవేక్షణలు, పాలనా వ్యవహారాలు, క్రమశిక్షణా యంత్రాంగాలలో సర్వత్రా కుల ఆధారిత వివక్ష పరివ్యాప్తమై ఉంది. పది విశ్వవిద్యాలయాలలో 600 మంది విద్యార్థినీ విద్యార్థులతో నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా సుకుమార్ ఈ వాస్తవాలు వెల్లడించారు. వైవాలు, ఇంటర్వ్యూలలో తాము వివక్షకు గురవుతున్నామని మూడింట రెండు వంతుల మంది విద్యార్థులు వెల్లడించారు. ఆ వివక్షకు ప్రాథమిక కారకులు అధ్యాపకులే అని 60శాతం మంది విద్యార్థులు నిర్ధారించారు. అంతే శాతం మంది దళిత పరిశోధక విద్యార్థులు తాము పర్యవేక్షణాపరమైన దోపిడీకి గురవుతున్నామని తెలిపారు. మరి ఓబీసీల విషయంలో ఈ వివక్ష ఎలా ఉందని మీరు ప్రశ్నించవచ్చు. మన విశ్వవిద్యాలయాలలో ఆ విద్యార్థుల అనుభవాలు ఆ ఉన్నత విద్యా సంస్థలు ప్రజాస్వామిక నెలవులుగా లేవు అని మాత్రమే స్పష్టం చేస్తున్నాయి. ఈ వివక్షను అరికట్టేందుకు 2012లో యుజీసీ జారీ చేసిన నిబంధనలను రూపొందించడంలో ఆ సంస్థ సభ్యుడిగా నేనూ పాలుపంచుకున్నాను. ఆ తొలి నిబంధనలను అమలుపరిచేందుకు నిర్దేశించిన సంస్థాగత ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవు. వాటితో పోల్చితే ఇటీవలి కొత్త నిబంధనలు సంస్థాగత ఏర్పాట్ల విషయంలో చాలా మెరుగ్గా ఉన్నాయి. వివక్షను ఇవి విస్తృత ప్రాతిపదికన నిర్వచించాయి. వేధింపులు, వ్యక్తిగతంగా బాధించడం, వ్యతిరేకత చూపించడం మొదలైనవి కూడా వివక్ష కిందకు వస్తాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రత్యక్ష, పరోక్ష వివక్షలు అన్నిటినీ రూపుమాపడమే కొత్త నిబంధనల లక్ష్యంగా ఉన్నది. కొత్త నిబంధనలు ప్రశస్తమైనవి అనడంలో సందేహం లేదు. సమస్యల్లా వాటిని ఆచరణలోకి తీసుకురావడమే. ఇదిగో, ఈ విషయంలోనే సంకల్పం కొరవడుతోంది. 2012లో యూజీసీ జారీ చేసిన నిబంధనలు కాగితాల మీదనే ఉండిపోయాయి. వాటి గురించి విద్యార్థులకు తెలియనే తెలియదు. మరి 2026లో జారీ అయిన కొత్త నిబంధనల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుందా? ఈ వ్యవహారం ఒక న్యాయ వివాదం కాదు. ఒక న్యాయ వివాదంగా అది రూపొందకూడదు. విద్యా సంస్థల్లో వివక్షకు వ్యతిరేకంగా యూజీసీ జారీ చేసిన పాత నిబంధనలు, కొత్త నిబంధనలు రెండూ కూడా రాజ్యాంగం నుంచి స్ఫూర్తి పొందినవే. 'కులం, సంప్రదాయం, మతం, భాష, జాతి, జెండర్, వైకల్యం' ఆధారంగా ఎటువంటి వివక్ష చూపడానికి వీలులేదని పాతవీ, కొత్తవీ రెండూ స్పష్టం చేశాయి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు సంభావ్య వివక్ష నుంచి రక్షణ కల్పించాలని పాత నిబంధనలు నిర్దేశించాయి. ఆ సామాజిక వర్గాలకు తోడుగా ఓబీసీలకు కూడా అటువంటి రక్షణ కల్పించాలని కొత్త నిబంధనలు పేర్కొన్నాయి.

# కొండవాలు ప్రాంత సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్‌కు వినతి అందజేసిన గంకల కవిత అప్పారావు యాదవ్

**- ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుతో కలిసి కమిషనర్‌ను వార్డు పర్యటనకు ఆహ్వానించిన గంకల కవిత అప్పారావు యాదవ్ - 48వ వార్డులో మౌలిక వసతులకు కృషి చేయాలని కోరిన గంకల కవిత అప్పారావు యాదవ్ - గంకల కవిత అప్పారావు యాదవ్ వినతిపై సానుకూలంగా స్పందించిన జీవీఎంసీ కమిషనర్**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ కౌన్సిల్ హాల్‌లో బుధవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం సమస్యల వలయంలో ఉన్న 48వ వార్డు సమస్యలపై ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుతో కలిసి జీవీఎంసీ కమీషనర్‌ను పర్యటన చేయాలనీ కోరారు. వార్డులో మహాత్మా గాంధీ నగర్, జవహర్ లాల్ నెహ్రూ నగర్, బాపూజీ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజిలు మరమ్మత్తులకు గురి అయ్యాయని సీసీ రోడ్లు, డ్రైనేజిలు సమస్యలు పరిష్కారం చూపాలని, ఇందిరా నగర్-5లో సామా జిక భవనం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఇందిరా నగర్-5 లో గల వరుణ్ బజాజ్ షో రూమ్ వెనకాల సామాజిక భవనం నిర్మాణం చేపట్టాలని, వార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్మశాన వాటికను కోట్ల రూపాయల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందని సెక్యూరిటీ లేక ఆకతాయిలు, మందుబాబులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి అక్కడికి వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోగ్య కేంద్రం, స్మశాన వాటిక వద్ద సెక్యూరిటీ గార్డును, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రధాన జంక్షన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా చేయాలని, వార్డులో చాలా చోట్ల రోడ్లు, ప్రధాన డ్రైనేజీలు మరమ్మత్తులకు గురి అయ్యాయని దీంతో వాహనదారులు, ప్రజలు ఈ రోడ్డులో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, దెబ్బతిన్న డ్రైనేజీలతో వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని వార్డులో పలుచోట్ల నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలనీ, వార్డులో ఇప్పటివరకు నూతనంగా టెండర్లు దక్కించుకున్న కొన్ని పనులు మొదలు అవ్వలేదని టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు తక్షణమే పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేయాలని, వార్డు అభివృద్ధిలో భాగంగా ఉన్న సమస్యలపై నూతనంగా టెండర్లను పిలవాలని, వార్డులో పర్యటించి క్షేత్ర స్థాయి నుంచి నెలకొన్న సమస్యలు నేరుగా చూసి, వార్డు పరిధిలో అవసరమగు మౌళిక వసతులు పర్యవేక్షణ చేసి ప్రజల ఇబ్బందులను నేరుగా గమనించి పరిష్కరించాలని మేయర్‌ను జీవీఎంసీ కమీషనర్‌ను కోరినట్టు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు.

# సమాజ ప్రగతిలో జర్నలిస్టులదే కీలక పాత్ర

**- ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలి : జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సమాజ ప్రగతిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అటువంటి వారి సేవలను ప్రభుత్వాలు మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఎజె) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఏపీఎన్జీవో హోంలో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదులో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జర్నలి స్టులకు ప్రభుత్వ పరంగా మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ఈ పథకం అమలులో ఉంటే జర్నలిస్టులు జీవితాలకు చాలా వరకు భరోసా కలుగుతుందన్నారు. గతంలో ప్రీమియం రెండు వందలు చెల్లిస్తే దానికి ప్రభుత్వం కొంత మొత్తం జమ చేసేదని, ఎవరైనా ప్రమాద బారిన పడినప్పటికీ బీమా సొమ్ము అందడం వల్ల వైద్యానికి ఇతర ఖర్చులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. కాబట్టి ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాల్సిందిగా వీరు కోరారు. అలాగే పదవి విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాల్సి ఉందన్నారు.

**8 వరకు సభ్యత్వ నమోదు గడువు పెంపు**

ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు యూనియన్ నాయకులు గంట్ల శ్రీనుబాబు పి.నారాయణ జి. శ్రీనివాసరావులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా జర్నలిస్టులు నూతన సభ్యత్వము రెన్యువల్సును స్వీకరించడం జరిగిందన్నారు. అయితే ఇంకా అనేక మంది జర్నలిస్టులు సభ్యత్వం పొందాల్సి ఉన్నందున ఈ నమోదు ప్రక్రియను ఈనెల 8న సోమవారం వరకు పొడిగించినట్లు వీరు చెప్పారు. ఆనందపురం పద్మనాభం భీమునిపట్నం తదితర ప్రాంతాల జర్నలిస్టులు సౌకర్యార్థం ఆదివారం (ఫిబ్రవరి 7) భీమిలిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఏపీ ఎన్జీవో హోంలో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అయితే తర్వాత గడువు పొడిగించే అవకాశం లేదన్నారు. కాబట్టి తక్షణమే అర్హులైన జర్నలిస్టులంతా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు

# సెల్ ఫోన్ షాపులో చోరీ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట - పెద్దాపురం రోడ్డులోని మఠం సెంటర్ సమీపాన గల "స్వస్తిక్ మొబైల్ షాప్"లో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దుకాణ యజమాని రాత్రి షాపు మూసి వెళ్ళిపోగా అర్ధరాత్రి సమయంలో షాపు పైన ఉన్న రేకులు తొలగించి, సీలింగ్ కు రంధ్రం చేసి దానిగుండా షాపులోనికి దిగి గుర్తు తెలియని దొంగలు షాపులో విలువైన సెల్‌ఫోన్లు, ఇతర సామాగ్రిని దొంగలించారు. ఉదయం దానిని గుర్తించిన యజమాని సమాచారం పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా సిఐ ఎ కృష్ణ భగవాన్, క్రైమ్ సిఐ అంకబాబు క్రైమ్ ఎస్ఐ ఎం వి కృష్ణరావులు షాపును పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే కాకినాడ నుండి క్లూస్ టీమ్‌ను రప్పించగా సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. ఈ చోరీపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జీవ ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ

**- ఆత్మ, వ్యవసాయ ఎడిఎలు ప్రశాంతి, దుర్గాలక్ష్మి**



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష పత్రం - ప్రాధ్యానత, డిజిటల్ వ్యవసాయంలో డ్రోన్ ఉపయోగంపై రైతులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఆత్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో జీవన ఉత్పత్తి కేంద్రం ఎడిఎ ఎన్ ప్రశాంతి మాట్లాడుతూ పంటకు కావలసిన పోషకాలను నేల నుండి లేదా వాతావరణం నుండి గ్రహించి మొక్కలకు అందించే జీవుల సముదాయాన్ని జీవన ఎరువులు లేదా బయో ఫెర్టిలైజర్స్ అంటారన్నారు. అజోస్పైరిల్లం ఎకరాకు 500మిల్లీ లీటర్లు కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరా నేలపై వెదజల్లాలని, దీని వలన వాతావరణంలో వున్న నత్రజని అజోస్పైరిల్లం యూరియా వాతావరణంలో నుంచి గ్రహించి మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. ఫాస్ఫా బాక్టీరియ మరియు పోటాషియం రిలీజింగ్ బాక్టీరియాను ఎకరాకు 500 మిల్లీ లీటర్ కల్చరును పశువుల ఎరువులలో కలిపి ఎకరా నేలపై వెదజల్లితే భూమిలో కరగకుండ ఉన్న భాస్వరం, పోటాష్‌ను కరిగించి మొక్కకు అందజేయడం జరుగుతుందన్నారు. దానివలన రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, పర్యావరణాన్ని రక్షిస్తుందన్నారు. ఈ మూడు బాక్టీరియాలను కలిపి వినియోగించవచ్చునని, అయితే ఎట్టి పరిస్థితిలో రసాయనక ఎరువులతోనూ, పురుగు మందులల్లో వీటిని కలపకూడదని రైతులకు సూచించారు. ఈ బాక్టీరియాలు పొలంలో వేసిన తరువాత వారం రోజులు ఎలాంటి రసాయనాలకు, ఎరువులు, పురుగు మందులు వాడకూడదని ఆమె రెతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కాకినాడ ఏడి కె.దుర్గలక్ష్మి మాట్లాడతూ ప్రకృతి వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయం (ఈ పంట) అంశాలపై రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి వి మురళీధర్ మాట్లాడుతూ భూసార పరీక్ష పత్రం (సోయిల్ హెల్త్ కార్డు) ప్రాధాన్యత గురించి, వ్యవసాయంలో డ్రోన్ ఉపయోగం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఈవో జి రూప, విఎఎలు దినేష్, నాయుడు, సొసైటీ అధ్యక్షులు పాలకుర్తి భావన్నారాయణ (రవిబాబు), డైరెక్టర్ జానా వెంకట్రావు, రైతు నాయకులు పాలచర్ల వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులతో వస్తున్న బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

**- నిర్లక్ష్యంగా నడిపిన బస్ డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్.. బస్సు పర్మిట్ 3 నెలలు సస్పెండ్ - తరచు పాఠశాల బస్సులు ప్రమాదాలకు గురి కావడంతో తీవ్ర ఆందోళన**





**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఇటీవల కాలంలో తరచూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురి కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళ నకు గురవుతున్నారు. యాజమాన్యం బస్సుల కండిషన్‌పై దృష్టి పెట్టకుండా బస్సులను నడుపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏఎస్ఎన్ కళాశాలకు చెందిన బస్సు బుధవారం ప్రమాదానికి గురైె పంట కాలువలు పడిపోకుండా విద్యుత్ స్తంభానికి ఆనుకొని పెను ప్రమాదం నుండి బయటపడింది. బుధవారం ఉదయం సమనస వైపు నుంచి అమలాపురం వస్తున్న ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. సమనస నుంచి కామనగరువు వచ్చే రోడ్‌లో బస్సు అదుపు తప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయే పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి నిలిచిపోయింది. దాంతో మహిళా కళాశాల బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనను జిల్లా రవాణా అధికారులు సీరియస్‌గా తీసుకున్న అమలాపురం ఆర్టీవో కార్యాలయంలో డ్రైవర్‌ను విచారించారు. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఎ.ఎస్.ఎన్ మహిళా కళాశాల బస్సు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌ను, బస్సు పర్మిట్ ను మూడు నెలల పాటు సస్పెండ్ చేశామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బస్సు ప్రమాదా నికి డ్రైవర్ సెల్ ఫోన్ మాట్లాడుతూ వేగంగా నడపడమే కారణమని ప్రాథమిక విచారణలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ నిర్ధారించారని డీ.టీ.ఓ పేర్కొన్నారు. ఈ మధ్య జరిగిన ప్రమాదాల్లో బస్సు డ్రైవర్ తప్పిదాలే కారణమవుతున్నాయని త్వరలోనే స్కూల్,కాలేజీ బస్సుల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి విధివిధానాలను రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి పోలీస్ అధికారులు హాజరవుతారని డీ.టీ.ఓ తెలిపారు. ప్రతి బడి బస్సులో అటెండెంట్ వద్ద మాత్రమే సెల్ ఫోన్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని రహదారి భద్రత ఉల్లంఘన ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని డీ.టీ.ఓ శ్రీనివాసరావు హెచ్చరించారు.

# చీరకట్టులో దివి అందాలు చూడతరమా?



ఒకవైపు సినిమాలలో అవకాశాలు అందుకుంటూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో ఫాన్స్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిలో దివి కూడా ఒకరు. 2019లో వచ్చిన మహేష్ బాబు 'మహర్షి' సినిమా ద్వారా సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. ఇక ఈ సినిమాలో నటిగా పెద్దగా గుర్తింపు రాకపోయినా.. బిగ్ బాస్ తెలుగు సీజన్ 4 లో కంటెస్టెంట్ గా పాల్గొని ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది. 2020లో హైదరాబాద్ టైమ్స్ టీవీ పరిశ్రమకు చెందిన మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ గా అవార్డు కూడా అందుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ మధ్యకాలంలో నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ గ్లామర్ ఒలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న దివి తాజాగా మరోసారి చీరకట్టులో గ్లామర్ డోస్ పెంచేసింది. నడుము అందాలను చూపిస్తూ తన గ్లామర్‌తో హైలెట్గా నిలిచింది. చక్కగా జుట్టును ముడి వేసుకొని.. స్టోన్‌తో డిజైన్ చేసిన చెవి దుద్దులు పెట్టుకున్న ఈమె.. మెడను సింపుల్ చైన్ తో ఫుల్ ఫీల్ చేసింది. ఇక ఎర్రటి గాజులు ధరించి మరింత అందంగా ముస్తాబయింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికైతే చూడ చక్కని బొమ్మలా అందరి దృష్టిని ఆకర్షించింది దివి అంటూ ఆమె అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఏదేమైనా చాలా రోజుల తర్వాత ఇలా సింపుల్ లుక్‌లో చీర కట్టులో కూడా అందరి హృదయాలు దోచుకుంది దివి. ఇదిలా ఉండగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దివి4 తన కెరియర్‌లో జరిగిన పలు విషయాలను అభిమానులతో పంచుకుంది. అలాగే ఒక ఇంటర్వ్యూలో పాల్గొని వ్యక్తిగత స్వేచ్ఛ, సమాజంలో మహిళల పట్ల అవగాహన గురించి లోతైన చర్చను ప్రారంభించింది . అందులో భాగంగానే ఒక పబ్ ఈవెంట్‌కి అతిధిగా వెళ్ళినప్పుడు ఎదురైన సంఘటన గురించి చెప్పుకొచ్చింది. దివి మాట్లాడుతూ ఇటీవల ఒక పబ్ ఈవెంట్‌కి అతిథిగా వెళ్లాను. చుట్టూ బాడీగార్డ్లు ఉన్నప్పటికీ కూడా ఒక వ్యక్తి నా నడుముకి గిల్లాడు. ఆ సంఘటన జరిగిన వెంటనే వెనక్కి తిరిగి ఆ వ్యక్తిని కొట్టి అక్కడి నుంచి వెళ్ళిపోయాను. అయితే ఈ చర్య పట్ల నాకు ఏమాత్రం పశ్చాతాపం లేదు. ఒకవేళ నేను అలా స్పందించకపోతే భవిష్యత్తులో బాధపడేదాన్నేమో.. నా చుట్టూ భద్రత ఉన్నప్పటికీ ఈ సంఘటన జరిగింది.. అయితే ఇది నా దుస్తుల వల్ల జరగలేదు" అంటూ నొక్కి మరీ చెప్పింది దివి.. సౌకర్యవంతమైన టీ షర్టు ధరించినప్పటికీ ఒక ఆకతాయి ఇలా చేయడం నాకు ఏమాత్రం నచ్చలేదు. అందుకే చర్యకు ప్రతిచర్య జరిగింది అంటూ చెప్పుకొచ్చింది..ప్రస్తుతం దివి చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఏది ఏమైనా మహిళల వస్త్రధారణపై కామెంట్లు వస్తున్న నేపథ్యంలో తాను సభ్యతగా ఉన్నప్పటికీ ఇతరుల వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఇన్ డైరెక్ట్‌గా చెప్పుకొచ్చింది.

# ధనుష్, మృణాల్.. ఆ హీరో అలా అన్నాడేంటి..





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, క్రేజీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ రిలేషన్‌లో ఉన్నట్లు గత కొన్ని నెలలుగా రూమర్లు వినిపిస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ లో గతంలో జరిగిన రెండు ఈవెంట్స్‌లో ఇద్దరు కలిసి కనిపించడంతో.. అప్పటి నుంచి ప్రేమలో ఉన్నట్లు ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఆ మధ్య ఫిబ్రవరి 14వ తేదీన పెళ్లి కూడా చేసుకున్నారని ఓ రేంజ్‌లో సోషల్ మీడియాలో జరిగింది. దీంతో కొన్ని రోజుల క్రితం డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ రెస్పాండ్ అయ్యి.. ధనుష్ తనకు ఓ మంచి ఫ్రెండ్ అంటూ క్లారిటీ ఇచ్చారు. అలా రూమర్స్ కు చెక్ పెట్టారు. ఇక రీసెంట్‌గా మృణాల్.. ధనుష్ తనకు ఓ సోదరుడులాంటి వాడు అన్నట్లు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ అయింది. అది ఫ్యాన్ పేజీగా తెలుస్తుండగా.. ఆ విషయం తెగ చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత లవ్ కోసం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మృణాల్.. ప్రేమ ఎంతో అందమైన భావన అని తెలిపారు. ప్రపంచంలో ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రేమ కచ్చితంగా పుడుతుందని, అది మనల్ని ఓ మంచి వ్యక్తిగా మారుస్తుందని చెప్పారు. మనలోని పసి ఛాయలను దూరం చేస్తుందని, లవ్ ప్రపంచంలో ఒక అందమైనదిగా వర్ణించారు. ప్రతి ఒక్కరు జీవితంలో ప్రేమను పొందాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. ఆ కామెంట్స్ ఇప్పటికీ వైరల్ అవుతుండగా.. తాజాగా ఓ బాలీవుడ్ హీరో చేసిన కామెంట్ హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్‌లో మృణాల్, బాలీవుడ్ హీరో సిద్ధాంత్ పాల్గొన్నారు. అందులో ఇద్దరి మధ్య ఫన్నీ కన్వర్జేషన్ జరిగింది. అప్పుడే సిద్ధాంత్ ఒక్కసారిగా మృణాల్ ను ఆటపట్టిస్తూ.. ఇన్సే నావో చెన్నై వాలా (ఆ చెన్నై వ్యక్తి గురించి ఆమెను అడగండి) అని కామెంట్ చేశారు. దీంతో అంతా నవ్వగా.. మృణాల్ రియాక్షన్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఒక్కసారిగా బ్లష్ అవుతూ ఆమె నవ్వేసింది. కాస్త సిగ్గు పడినట్టుగా, ఆశ్చర్యపోయినట్టు కనిపించారు. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. సిద్ధాంత్ ధనుష్ కోసమే అన్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఎందుకంటే.. చెన్నైకు చెందిన స్టార్ హీరో ధనుష్ అన్న విషయం అందరికీ తెలిసిందే. మృణాల్ బ్లష్ అయిన విజువల్స్ ను నెటిజన్లు షేర్ చేస్తూ.. ఏదో ఉన్నట్లు అనిపిస్తుందని కామెంట్లు పెడుతున్నారు. దీంతో మళ్లీ డేటింగ్ రూమర్స్ ఊపందుకున్నాయి. అయితే సిద్ధాంత్ సరదాగా అని ఉంటారని కొందరు నెటిజన్లు చెబుతున్నారు. సెలబ్రిటీలు ఇలాంటి ఈవెంట్లలో ఒకరినొకరు ఆటపట్టించడం సాధారణమేనని, మృణాల్ కూడా కూల్‌గా రెస్పాండ్ అయిందని అంటున్నారు. అయితే ఏదేమైనా ధనుష్- మృణాల్ మధ్య నిజంగా ఏదైనా ఉందా? లేదా? అన్నది వారికే తెలియాలి.


# బేబి బంప్‌తో ఫ్యాషనిస్టా స్టన్నింగ్ ఫోజ్





తెలుగు ప్రేక్షకులకు 'కృష్ణ గాడి వీర ప్రేమ గాథ' సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేయగలిగింది. అంతే కాకుండా మిల్కీ బ్యూటీ తమన్నా తరహాలో ఉందంటూ చాలా మంది జూనియర్ మిల్కీ బ్యూటీ అంటూ మెహ్రీన్‌కి ముద్దుగా పేరు పెట్టుకున్నారు. అయితే మిల్కీ బ్యూటీ తమన్నా స్థాయిలో జూనియర్ మిల్కీ బ్యూటీ మెహ్రీన్‌కి లక్ కలిసి రాలేదు, అంతే కాకుండా ఆమె తీసుకున్న నిర్ణయాల కారణంగా చాలా సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా ఐదారు సంవత్సరాల పాటు వరుస సినిమాలు చేసిన మెహ్రీన్ ఈ మధ్య కాలంలో సినిమా ఇండస్ట్రీలో కాస్త స్లో అయింది. గత రెండు సంవత్సరాలుగా ఈమె చేస్తున్న సినిమాలు ఏమీ లేవు. ఈమె చివరిగా 2023లో స్పార్క్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కూడా నిరాశపరచడంతో కొత్త ఆఫర్లు ప్రస్తుతానికి ఏమీ రావడం లేదు. ఒక కన్నడ మూవీ ఈమె చేతిలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. అది హిట్ అయితే తప్ప కెరీర్‌లో ముందుకు సాగే పరిస్థితి లేదు. సినిమా ఇండస్ట్రీలో తీవ్రమైన ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 3.2 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు క్రొయేషియా దేశానికి విహార యాత్రకు వెళ్లింది. అక్కడ రాజధాని జాగ్రెబ్ తర్వాత అతి పెద్ద రెండవ నగరం అయిన స్ప్లిట్ అనే చారిత్రాత్మక నగరంలో చిల్ అవుతుంది. అక్కడ దిగిన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. మోడ్రన్ డ్రెస్‌లతో పాటు, అప్పుడప్పుడు చీర కట్టులోనూ మెహ్రీన్ కనిపిస్తూ ఉంటుంది. ఈసారి విభిన్నమైన ఊసరవెల్లి తరహా డ్రెస్‌ను ధరించింది. పైన ధరించిన కోర్ట్‌కి బటన్స్ పెట్టకుండా అందాల ఆరబోత చేస్తుంది. మెహ్రీన్ ఎంతటి అందాల ఆరబోత చేసినా కూడా ఎబెట్టుగా ఎప్పుడూ అనిపించదు. చాలా అందంగా ఉంటుందని నెటిజన్స్‌తో పాటు ఆమె ఫ్యాన్స్ అంటూ ఉంటారు. ఇంత అందంగా ఉన్న మెహ్రీన్‌కు ఆఫర్ల విషయంలో అన్యాయం జరుగుతోంది. తెలుగు సినిమాల్లోనే కాకుండా ఇతర భాషల సినిమాల్లోనూ ఆఫర్లు రాకపోవడం విడ్డూరంగా ఉందని ఆమె ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోలు, వీడియోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతున్నాయి. కనుక ముందు ముందు అయినా ఈ అమ్మడు హీరోయిన్‌గా బిజీ అవుతుందేమో చూడాలి. తెలుగులో మరొక్క ఆఫర్ వస్తే ఈ అమ్మడు తనను తాను నిరూపించుకుంటుందని అభిమానులు వెయిట్ చేస్తున్నారు. మరి మెహ్రీన్‌కు మరో ఛాన్స్‌ను తెలుగు ఫిల్మ్ మేకర్స్ ఇచ్చేనా అనేది చూడాలి. తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లోనూ ఈమెకు ఆఫర్లు వస్తాయనే నమ్మకంను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# చీరకట్టులో గిలిగింతలు పెడుతున్న మానస వారణాసి.. ఆ స్మైల్ కే ఫిదా గురూ!







సినిమా అనే రంగుల ప్రపంచంలో ముఖానికి రంగు పులుముకొని ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ఎంతోమంది పరితపిస్తున్నారు. అందులో భాగంగానే సామాన్యులను మొదలుకొని సెలబ్రిటీల వారసులు కూడా ఇండస్ట్రీలోకి అడుగు పెడుతూ తమ టాలెంటును నిరూపించుకుంటున్నారు. ఇంకొంతమంది సినిమాపై ఇష్టంతో మోడల్స్‌గా మారి ఇష్టంతో కష్టమైన పనులను కూడా చేస్తూ ఆఖరికి మిస్ ఇండియా, తెలంగాణ మిస్ వరల్డ్ టైటిల్స్ ను సొంతం చేసుకొని ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. అలా మార్గం ఏదైనా సరే ఇండస్ట్రీలోకి రావాలనే కలను నెరవేర్చుకుంటున్నారు. అలాంటి వారిలో మానస వారణాసి కూడా ఒకరు. ఫెమినా మిస్ ఇండియా 2020 అందాల పోటీలో పాల్గొని కిరీటాన్ని అందుకున్న ఈమె.. పలు యాడ్స్‌లో కూడా నటించి ఆకట్టుకుంది. ఇక 2020 డిసెంబర్ 20న కోకో కోలా మ్యూజిక్ హాల్లో జరిగిన మిస్ వరల్డ్ పోటీలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది. అలాంటి మానస వారణాసి 1997 మార్చి 27న హైదరాబాదులో జన్మించింది..ఈమె తండ్రి ఉద్యోగం కారణంగా మలేషియాకు వెళ్లిన మానస 2012లో పదవ తరగతి పూర్తి చేసింది. ఆ తర్వాత హైదరాబాద్‌కి వచ్చి.. ఎఫ్ఐఐటి జేఈఈ లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఈమె.. వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఫ్యాక్ట్ సెట్‌లో ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ఎక్స్చేంజ్ విశ్లేషకురాలిగా కూడా పనిచేసింది. ఇక ఆ తర్వాతే మోడల్‌గా మారి పలు అందాల పోటీలలో పాల్గొని తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఈమె.. గత ఏడాది దేవకీ నందన వాసుదేవా అనే సినిమా ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇందులో అశోక్ గల్లా హీరోగా నటించారు. ఈ ఏడాది కపుల్ ఫ్రెండ్లీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో సంతోష్ శోభన్ హీరోగా, మానస వారణాసి హీరోయిన్గా వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రాన్ని యు వి క్రియేషన్స్, యు వి కాన్సెప్ట్స్ బ్యానర్లపై అజయ్ కుమార్ రాజు నిర్మిస్తున్నారు. ఇక ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా అందులో తన అద్భుతమైన లుక్స్ తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది మానస వారణాసి.

# నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేసాం : ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం నియోజకవర్గం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని పి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం నియోజకవర్గం లో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ శంకుస్థాపనలు చేశారు. పి.గన్నవరం మండలం, కె.ముంజవరం ముగండపాలెం గ్రామపంచాయతీ పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మరియు అంబాజీపేట మండలం, తొండవరం గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో కూడిన తాగునీటి ట్యాంకు శంకుస్థాపన కార్యక్రమా లను బుధవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి తాగునీరు అందించే ప్రాజెక్టులో భాగంగా, సుమారు 1650 కోట్ల రూపాయల వ్యయంతో వాటర్ గ్రిడ్‌తో పాటు తాగునీటి మౌలిక సదుపాయాలు నిర్మించబడుతున్నాయని తెలి పారు. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు నిరంతరం అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. అలాగే, "గోదావరి జిల్లా పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా ప్రతి ఒక్కరికీ రక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో డ్రైనేజీ వ్యవస్థలను కూడా మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తొండవరం గ్రామ ప్రజలు, పాత తాగునీటి ట్యాంకుకు అవసరమైన సరైన బిట్లు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వెంటనే ఎంపీడీవో, ఎంపీటీవోలతో మాట్లాడి, పాత వాటర్ ట్యాంకు మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మం అనంతరం, పక్కనే ఉన్న అంగన్వాడి భవనంలో పాఠశాల పిల్లలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల అధ్యక్షులకు ఆహ్వానం

**ఆలమూరు, (రాజధాని వార్తలు):** ఆలమూరు, ఈనెల 5న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మన నీరు మన భవిష్యత్తు"లో సాగునీటి సంఘాల పాత్రపై అమరావతిలో హైకోర్టు దగ్గర పెరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న సమావేశానికి నీటి సంఘాల అధ్యక్షులకు ఆహ్వానం అందిందని మండలంలోని చింతలూరు నీటి సంఘం అధ్య క్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి తెలిపారు. ఈ మేరకు మంగళ వారం పెదపల్ల ఆయన నివాసం వద్ద ఆహ్వాన పత్రికను అం దుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నీటిపారు దల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో మన నీరు, మన భవిష్యత్తుపై సమావేశం జరుగుతుందన్నారు. అందుకు రాష్ట్ర నలుమూలల నుంచి నీటి సంఘాల అధ్యక్షులకు ప్రత్యేక ఆహ్వానాలు అందుతున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావే శానికి హాజరై రైతుల అవసరాలు, కాలువ గట్ల పటిష్టతకు



చర్యలు, ఇంతవరకు జరిగిన పనులకు విడుదల కానీ నిధుల పైన సమావేశంలో ఆయన తెలిపారు.

# గృహనిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి : ఈఈ చంద్రశేఖర్ వెల్లడి



**ఆలమూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణాలను వచ్చే ఉగాది నాటికి పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.చంద్రశేఖర్ సూచిం చారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కొత్తపేట డివిజన్ స్థాయిలో ఎంపీడీఓ ఏ రాజు అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మంజూరైన 285 గృహల నిర్మాణం ఉగాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణ యించడం జరిగిందన్నారు. దీనిలో కొత్తపేట నియోజకవర్గంలో ఆలమూరు 18, ఆత్రేయపురం 42, కొత్తపేట 40, రావులపాలెం 34 గృహాలు, అలాగే పి.గన్నవరంలో అయినవిల్లి 68, అంబాజీపేట 28, పి.గన్నవరం 46 గృహాలను పూర్తి చేయాలని టార్గెట్ నిర్ణయించడం జరిగిందన్నారు. అధికారులందరూ ఈ లక్ష్యాన్ని త్వరితగతిని పూర్తి చేసి ప్రజలకు గృహాలను అందు బాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతీ గృహనికి లబ్దిదారునికి రూ.లక్షా 80వేలు చెల్లించడం జరుగు తుందని ఆయన వివరించారు. రావులపాలెం, అయినవిల్లి, కొత్తపేట ఏఈలు జేజిబాబు, శ్రీధర్, గణేష్ కుమార్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్ జైలు నందు పుస్తక నిక్షిప్త కేంద్రం ఏర్పాటు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం సబ్ జైలునందు ఉ మ్మడి తూర్పుగోదావరి జిల్లా, గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాల యానికి అనుబంధంగా పుస్తక నిక్షిప్త కేంద్రంను బుధవారం జిల్లా కార్యదర్శి (ఎఫ్.ఎ.సి.) పాలంకి నాగరాజు సబ్ జైల్ సూపరిం టెండెంటు కె.రమణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ తెలియక చిన్న చిన్న తప్పులు వేసిన వారికి కాలక్షేపం గా పుస్తకాలు చదవాలని, నెలవారీ 50 పుస్తకాలు, దినపత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు చదువుకోవచ్చునని వారు తెలి పారు. ఈ కార్యక్రమంలో డి.కార్తిక్ బాబు, హెడ్ వార్డర్ కె. గంగాధర్, డిప్యూటి లైబ్రేరియన్ కె.కిశోర్, సాయి వెంకట్రావు,




సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు

## - దేశంలో 55 సోలార్ పార్కులకు అనుమతులు
## - ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**కాకినాడ, (రాజధాని వార్తలు):** దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసు కుంటున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ వెల్లడించారు. సోలార్ విద్యుత్ ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలపై బుధవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్ర మంత్రి వివరాలు వెల్లడించారు. సోలార్ పార్కులు మరియు అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టుల అభివృద్ధి పథకం కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు ఇప్పటివరకు 55 సోలార్ పార్కులు మంజూరు ద్వారా 39, 973 మెగా వాట్ల విద్యుత్ మంజూరు చేయగా, ఇందులో 16,121 మెగావాట్ల విద్యుత్తు కమిషన్ చేయబడి, 8,176 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని, ఇందులో భాగంగా గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు 105.5 కోట్లు మంజూరు చేయ డంతో పాటు 4,200 మెగావాట్ల సోలార్ సామర్థ్యాన్ని మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

# వాడపాలెం - పలివెలలో తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి సమావేశం

## - స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి సమన్వయంతో ముందుకు సాగాలి : ముత్యాల బాబ్జి





**కొత్తపేట, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ ఆధ్వ ర్యంలో బుధవారం వాడపాలెం తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పప్పుల బుజ్జి, పలివెల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వై.వి.కృష్ణ అధ్యక్షతన గ్రామస్థాయి సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అనంతరం గడిచిన పద్దెనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కూటమిలో భాగంగా ఉన్న ఇతర పార్టీల నాయకు లను కూడా సమన్వయంతో కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెం డాలు ఎగరవేయాలంటే ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రోజు వాడపాలెం, పలివెల గ్రామాల్లో సమావేశం నిర్వహించగలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇకపై ప్రతి నెల ఒకటో తేదీన గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి గ్రామాల్లోని సమస్యలపై చర్చించుకుంటామని, ఏవైనా సమస్యలు ఉంటే మండల, జిల్లా నాయకుల రెడ్డి శ్రీను, కంఠంశెట్టి శ్రీను, పల్లి కుమార్ రాజ్ ప్రధానకార్యదర్శి కడలి భీమ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమస్యలు తమ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వైద్యం పొందుతున్న పేషెంట్లకు దగ్గరుండి వైద్యం అందిస్తున్న జనసేన యు.కొత్తపల్లి మండలం అధ్యక్షులు రావు అక్షయ్









**కాకినాడ, (రాజధాని వార్తలు):** కత్తిపూడిలో బుధవారం ఉదయం యు కొత్త మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన కూలీలు పని నిమిత్తం కత్తిపూడి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చందగా పలువురు గాయాలయ్యాయి. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ తరలించగా అక్కడ యు కొత్తపల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు రావు అక్షయ్ హాస్పిటల్ వద్ద రెడీగా ఉండి వచ్చిన పేషెంట్లకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా కృషి చేశారు. అనంతరం వాళ్లందరికీ దగ్గరుండి వైద్యం చేయించి సంబంధించిన డాక్టర్లతో మాట్లాడారు. దీంతో రావు అక్షయ్‌పై పలువురు హర్షం వెలిబుచ్చారు.

# గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల నిర్మాణం పార్టీ పటిష్టతకు కీలకం

## - మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్








**గజపతినగరం, (రాజధాని వార్తలు):** వైయస్సార్సీపి గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల నిర్మాణం పార్టీ పటిష్టతకు కీలకమని పార్టీ సీనియర్ నాయకులు, వైకాపా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడుతూ కార్యకర్తల ద్వారా పరిపాలన చేస్తే పార్టీ పరిస్థితి బాగుంటుందనే ఆలోచనతో పార్టీ అధినేత జగన్ గ్రామ కమిటీలను, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు. ప్రతి గ్రామంలో 8 కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని గ్రామ కమిటీలో 9 నుంచి 15 మంది సభ్యులు ఉంటారని, ఏడు అనుబంధ కమిటీలలో ఒక్కొక్క కమిటీలో 9 మంది సభ్యులు ఉండే విధంగా అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని బొత్స అన్నారు. కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం ఏర్పడి, పార్టీ బలపడుతుందని బొత్స ఉద్ఘాటించారు. గజపతినగరం నియోజవర్గం లో మొత్తం పదివేల ఎనిమిది వందల మంది సభ్యులతో కమిటీల ఏర్పాటు జరగవలసి ఉండగా ఇప్పటివరకు కేవలం 2,840 మంది కమిటీ సభ్యుల సమాచారం మాత్రమే పూర్తయిందని బొత్స అన్నారు. అదేవిధంగా గజపతినగరం మండలంలో 390 మంది కమిటీ సభ్యుల సమాచారం మాత్రమే పూర్తయిందని ఆయన అన్నారు. కమిటీల ఏర్పాటు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా, అందరినీ కలుపుకుని పోవాలని పార్టీ నేతలకు కార్యకర్తలకు అప్పల నరసయ్య హితవు పలికారు. పార్టీ అనుబంధ సంఘాలు, కమిటీల నిర్మాణాన్ని పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశించిన కాలపరిమితి (ఫిబ్రవరి-15) లోగా పూర్తి చేసి పార్టీ మరింత పటిష్టం అవడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని "బొత్స" పిలుపునిచ్చారు. ఈ కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీకి దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికీ ఈ కమిటీల్లో ప్రాధాన్యత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బొత్స హామీ ఇచ్చారు. కమిటీల సారథ్యంతోనే వైఎస్ఆర్సిపి రాబోయే ప్రతి ఎన్నికలలోను గెలుపు బావుటా ఎగురవేయాలని బొత్స పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు ఏర్పాటుతో పార్టీ ఎంతో బలోపేతం అవుతుందని అన్నారు. కమిటీల ఏర్పాటులో గజపతినగరం నియోజకవర్గం కొద్దిగా వెనుకబడి ఉందని ఎంపీ బెల్లాన అన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే కమిటీలే కీలక భూమిక పోషించనున్నాయని బెల్లాన చెప్పారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా కమిటీల ఏర్పాటు పూర్తి చేసే విధంగా శ్రేణులు కృషి చేయాలని బెల్లాన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జడ్పిటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, సోషల్ మీడియా ఇంచార్జ్ పిఎస్ఎన్ మూర్తి, వైకాపా నాయకులు బెల్లాన త్రినాథరావు, గేదెల జగదీష్, గేదెల ఈశ్వరరావు, పైడపు నాయుడు, నరసింగరావు, కర్రీ రామనాయుడు, రెడ్డి పద్మావతి, గెద్ద రమేష్, కర్రీ లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

# భూ హక్కుదారునికే పాస్ పుస్తకాలు అందజేయాలి

## - పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి ఫిబ్రవరి నెలకు 12 గ్రామాల్లో, మార్చి నెలకు సంబంధించి 61 గ్రామాల్లో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి








**విజయనగరం, (రాజధాని వార్తలు):** భూముల హక్కుదారులకే పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, రెవెన్యూ క్లినిక్, రీ సర్వే, ఐవిఆర్ఎస్ సర్వే, జాయింట్ ఎల్ పి ఎంలు, స్వామిత్వ, రైస్ మిల్లుల తనిఖీ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్ సేథు మాధవన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసేటప్పుడు వీలైనంతవరకు వాటి హక్కుదారునికే అందజేయాలని చెప్పారు. ప్రతీ నెలా 9వ తేదీలోపు పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ లోగా దిద్దుబాటు చేయాల్సిన అంశాలను సేకరించాలని, సిబ్బంది అంతా కలిసి 10-14 వ తేదీ వరకు మ్యుటేషన్స్ (ఫారం-8) ప్రక్రియను రూపొందించాలని, 15-17 వరకు సుమోటో కరెక్షన్స్ పూర్తి చేయాలని సూచించారు. మ్యుటేషన్‌కి సంబంధించి ట్రాన్సాక్షన్, కరెక్షన్, డెడ్ కరెక్షన్స్ విభాగాలుగా చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతినెలా 30 లోగా దిద్దుబాట్లను పూర్తి చేసి, ఇకేవైసి అనంతరం తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలని వివరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలు, భూ సర్వే మరియు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి ఫిబ్రవరి నెలకు 12 గ్రామాల్లో, మార్చి నెలకు సంబంధించి 61 గ్రామాల్లో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తిరస్కరించబడిన మ్యుటేషన్ దరఖాస్తులను పునఃసమీక్షించాలని, పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, జాయింట్ ఎల్పీఎంల విభజన, ఆన్‌లైన్ సేవలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కేంద్రం నుంచి డిఆర్వో ఇ.మురళి, సర్వేశాఖ ఏడి విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భారత కేంద్ర బడ్జెట్‌పై ఇంటరాక్టివ్ సెషన్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక సీతం కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో "భారత కేంద్ర బడ్జెట్ 2026 - సమగ్ర అవలోకనం" అనే అంశంపై ఒక ఇంటరాక్టివ్ సెషన్‌ను ఫిబ్రవరి 4, 2026 మంగళవారం డీఎంఎస్ సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆశిష్ కుమార్ అగర్వాల్, బి.కామ్, ఎఫ్‌సిఎ, డిసా, సీనియర్ పార్ట్నర్ - ఆశిష్ కుమార్ అగర్వాల్ & కో పాల్గొననున్నారు. ఈ సెషన్‌లో కేంద్ర బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు, ఆర్థిక విధానాలు మరియు వాటి ప్రభావాలపై సమగ్ర వివరణ అందించనున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థులకు కేంద్ర బడ్జెట్‌పై స్పష్టమైన అవగాహన కల్పించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా.డి.వి.రామమూర్తి ఇలాంటి అకాడమిక్ కార్యక్రమాలు విద్యార్థుల విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డా.ఎస్.వరూధిని ఈ సెషన్ ద్వారా విద్యార్థులు బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను ప్రాయోగిక దృష్టితో అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు, విద్యార్థిని మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి : అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరిం చాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా అధికారులతో పాటు పీజీఆర్ఎస్ నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో నిర్వహించిన హైబ్రిడ్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యంగా బియాండ్ ఎస్.ఎల్.ఏ కింద ఉన్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేవలం ఫిర్యాదును ముగించడం మాత్రమే కాకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నారు. మండల మరియు మున్సిపల్ స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కార వేగాన్ని పెంచాలని సూచించారు. నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు డేటాను విశ్లేషిస్తూ, సంబంధిత శాఖల పురోగతిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# సేవలే గుర్తింపునిస్తాయి

## - పదోన్నతి పొందిన సిహెచ్ శ్రీనివాసరావుకు ఘన సన్మానం

## - జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాలామాన్ సింగ్



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మనం చేసే సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో సహాయ సమాచార అధికారిగా పని చేస్తూ, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్‌గా పదోన్నతి పొంది విశాఖపట్నం బదిలీపై వెళ్తున్న సిహెచ్. శ్రీనివాసరావును కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ కె.బాలమాన్ సింగ్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన నాటి నుండి నిబద్ధతతో శ్రీనివాసరావు తమ సేవలు అందించారని పేర్కొన్నారు. పదోన్నతి, బదిలీ అనేవి పరిపాలనలో భాగం మాత్రమేనని అన్నారు. నిబద్ధతతో పనిచేసిన అధికారులకు పదోన్నతులు లభించడం గర్వకారణమని, కొత్త బాధ్యతల్లో అదే ఉత్సాహంతో అధికారులు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని ఆయన సూచించారు. ఆయన సిబ్బందితో ఎంతో కలుపుగోలుగా ఉండేవారని, పాత్రికేయ మిత్రులకు శ్రీనివాస్ అజాత శత్రువని కొనియాడారు. కష్టపడి పని చేసే వాళ్ళు ఎక్కడైనా రాణించగలరని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ యం.గజపతిరావు, డివిజన్ పిఆర్ఓ జి.వి. రవి కుమార్, సీనియర్ అసిస్టెంట్ వి.మాధవి, జూనియర్ అసిస్టెంట్ ఎన్.సుజాత, టైపిస్ట్ రాధారాణి సాహు, రికార్డ్ అసిస్టెంట్ ఏ.నాగేశ్వరరావు, డ్రైవర్ పి.ప్రసాద్, కార్యాలయ సిబ్బంది మోహిని, నిర్మల, లక్ష్మణ్, గౌరీశ్వరి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యం పెంపునకు క్షేత్రస్థాయి సందర్శన దోహదం




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వృత్తి విద్యలపై అవగాహనతో మంచి కెరీర్ సాధనకు ప్రభుత్వం కల్పించిన క్షేత్ర స్థాయి సందర్శన ఎంత గానో దోహదపడుతుందని సెవెన్ హిల్స్ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పసల పద్మ రాఘవరావు అన్నారు. పిఎం శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ అయోధ్యరామపురం కు చెందిన "ప్రీ వొకేషనల్" విద్యార్థులు బుధవారం జి రాగంపేట గ్రామంలోని సెవెన్ హిల్స్ పేపర్ మిల్స్ ను సందర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థులకు వృత్తి విద్యా రంగాలపై అవగాహన కల్పించేందుకు ఈ 'ఎక్స్‌పోజర్ విజిట్' నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు వేస్ట్ నుండి రీసైక్లింగ్ ద్వారా పేపర్ తయారీ గురించి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా స్థానిక టెక్స్ టైల్స్ ఫ్యాక్టరీను సందర్శించి అక్కడ జి బూరయ్య ద్వారా దారాల ఉత్పత్తి గురించి తెలుసుకొన్నారు. పుస్తకాల్లో చదివిన విషయాలను ఇలా కళ్ళారా చూడటం వల్ల తమకు పనుల పట్ల మంచి అవగాహన కలిగిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉచిత వాహన సదుపాయాన్ని స్థానిక ప్రతిభ విద్యనికేతన్ అదినేత ప్రకాశ్ కల్పించడం పట్ల హెచ్ ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే జి భవాని, ఎన్ హరనాథ్, సంబంధిత ట్రేడ్ ఫ్యాకల్టీ జి యాదిద్య, జి జ్యోతి, వి దుర్గాప్ర సాద్, ఆర్ శివకుమార్, కే శివ ప్రసాద్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ ఫోర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

## RAJADHANIVARTALU.COM 9440662699

# కళ్ళు పోతున్నాయి

## - నరకంగా మారిన రాత్రి ప్రయాణం - ప్రమాదాలకు ప్రధాన కారణం ఎల్ఈడీ లైట్లు - సగం లైట్ స్టిక్కర్ నిబంధన జాడలేదు



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** రాత్రి 7 గంటల తరువాత వాహనాలు నడపాలంటే భయమేస్తోంది. ఎదురొచ్చే వాహనాల ఎల్ ఈ డి లైట్స్ వల్ల కళ్లు కనిపించకుండపోతున్నాయి. కొత్తగా వచ్చే వాహనాలు కొత్తగా ఎల్ఈడి లైట్స్‌తో వస్తున్నాయి. ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ కరువు. నియంత్రణ జాడ ఎక్కడ లేదు. గతంలో వాహనాల హెడ్ లైట్‌కు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ ఉండాలి అన్న నిబంధన ఉండేది.. ఆ రూల్ తీసేసారో ఉందో తెలీదు. ఎల్ఇడి లైట్‌ల వలన ఎదురుగా వచ్చే వాహనాలు కన బడక....కళ్ళు మసకబారి ఏమీ కనపడకుండా పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి, కనుక సంబంధిత అధికారులు వాహనాల హెడ్ లైట్స్‌లకు వస్తున్న ఎల్ఈడి లైట్స్ గురించి చర్య తీసుకొని కనీసం హెడ్ లైట్లకు సగం వరకు బ్లాక్ స్టిక్కర్స్ కానీ, బ్లాక్ పెయింట్ కానీ వేయాలనే రూల్‌ను పునరుద్దరించాలి అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించాలి

## - విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి : కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** మంచి వసతులు, నాణ్యమైన విద్య,వసతి సదుపాయాలకు ప్రాధాన్యతనిచ్చి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. అం బేద్కర్ కోనసీమ జిల్లా గన్నవరం మండలం నరేంద్రపురంలో బుధవారం అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు డార్మెటరీ, వంట గది, టాయిలెట్లు, స్టోర్ రూమ్, దోమలు నెట్ వినియోగాలను ఆయన పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, పిచ్చి మొక్కలు తొలగింపు, వంట సరుకులు, కూరగాయలు, ఆయిల్, పప్పు, బియ్యం నాణ్య తలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బోధనా విధానాలు, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తాజా సరుకులతో ఆహారం తయారు చేయారు చేసి విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచాలనీ పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. గుణాత్మకమైన విద్యాబోధన ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసింపజేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు సూచనలు తప్పక పాటించాలని ఆదేశించారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థుల భోజనం, బోధనా ప్రక్రియ, పరిశుభ్రత, సౌకర్యాలను తనిఖీ నిర్వహించి విద్యార్థులతో మాట్లాడి వారి ఆకాంక్షలు తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ఏ మేరకు విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నారో ప్రశ్నించి తెలుసుకున్నారు. ఏవైనా లోపాలను వెంటనే సరిచేయాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో వైద్యులను సంప్రదించి నాణ్యమైన వైద్య సేవలను అందించడంతోపాటు అత్యవసర సందర్భాలలో ఐసిఐసిఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ సేవలను అందించాలన్నారు.

# 10లోగా సచివాలయం స్థాయిలో కమిటీలు వేయాలి

## - వైసీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియోజవర్గంలో గల ప్రతి సచివాలయం స్థాయిలో కమిటీలు వేసి డిజిటలైజేషన్ చేయాలని వైసీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఆయనతో కలిసి ఆశీలమెట్ట వద్ద గల పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ నియోజకవర్గంలో 14 వార్డులు వున్నాయని ఆయన గుర్తు చేశారు. ఈనెల 10వ తేదీలోగా ప్రతి వార్డులో గల సచివాలయాల పరిధిలో వెంటనే పార్టీ కమిటీలు వేయాలన్న హర్షవర్ధన్ పిలుపు మేరకు పోలింగ్ బూత్ వారీ కమిటీలు సైతం వేయాలని కోరారు. ఇప్పటికే వార్డు ఇన్చార్జులు, బూత్ కమిటీ అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. జీ వీ ఎం సి పాలకవర్గం కాల పరిమితి వచ్చే నెలలో పూర్తి అవుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేకత నేపధ్యంలో జరిగే జీ వీ ఎం సి ఎన్నికల్లో వైసీపీ గెలుపు తధ్యం అన్నారు. గత వైసీపీ మేయర్ హరి వెంకట కుమారిని గద్దె దించి పీలా శ్రీనివాసరావు దొడ్డి దారిలో మేయర్ అయ్యారని ఎద్దేవా చేశారు. మేయర్ అవ్వడానికి చేసిన ఖర్చు పైసా వసూల్‌లో భాగంగానే గీతం యూనివర్సిటీకి భూములు క్రమబద్దేకరణ కోసం జీ వీ ఎం సి కౌన్సిల్‌లో చీకటి తీర్మానామ్ ఆమోదించారని ఆరోపించారు. 50 ఏళ్లకే పించన్లు, మహిళలకు 18 వేలు అంటూ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి సర్కార్ విఫలమయిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోమటి శ్రీనివాస్ జిల్లా జనరల్ సెక్రటరీ గణగాళ్ల రామరాజు, స్టేట్ ఆర్‌టిఐ సెక్రటరీ దస్మాంతుల వేణు గోపాల్,జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్, స్టేట్ సంస్కృత విభాగం సెక్రెటరీ సాగర్, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, వార్డ్ మహిళా ప్రెసిడెంట్ రాము, వార్డ్ యూత్ ప్రెసిడెంట్ చేపల నూకరాజు దక్షిణ వైసిపి వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సీడ్ క్యాపిటల్‌పై శిక్షణ



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం లక్ష్మనాయుడు మాట్లాడుతూ, సీడ్ క్యాపిటల్ రుణం తీసుకున్న సభ్యులు ఆహార ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా చేతులు ద్వారా తయారు చేయడమే కాకుండా, మిషనరీ, భారీ యంత్ర సామగ్రి ద్వారా కూడా ఉత్పత్తులు తయారుచేసి ఆదాయం సంపాదించాలన్నారు. మిషనరీ కొనుగోలు నిమిత్తం పి.ఎం.ఎఫ్.ఎం రుణాలు బ్యాంకుల సమ్మతితో తీసుకొని, సంబంధిత సభ్యురాలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పి.నారాయణరావు, సీసీలు మూర్తి, సత్యనారాయణ, కైలాష్, రాముునాయుడు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan